

టన్ను చీనీ రూ.16,560

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16,560వేల ప్రకారం విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.11

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట రూ.11, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

32.8°/18.4°

జిల్లా అంతటా గురువారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు



పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రామచంద్రా రెడ్డి

పెద్దపప్పూరు: ఎలాంటి ఇబ్బందులు తలెత్తనీయకుండా గ్రామీణ ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేయాలని జెడ్పీ సీఈఓ రామచంద్రా రెడ్డి సూచించారు. గురువారం ఆయన మండలంలోని చాగల్లు, పెద్దపప్పూరులోని తాగునీటి పంప్‌హౌస్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎక్కడైనా తాగునీటి పైపులైను లీకేజీ తలెత్తితే తక్షణమే మరమ్మతులు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలకేంద్రంలోని సచివాలయం-1ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బోయపాటి శకుంతల, ఈఓఆర్డీ సురేష్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీనారాయణ, పంచాయతీ సెక్రటరీ మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న ఇంటర్వ్యూలు

అనంతపురం క్రైం: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 21న కర్నూలు ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్. నజీర్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీజిల్ మెకానిక్, మోటారు మెకానిక్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మ్యాన్ సివిల్ విభాగాలకు సంబంధించిన వారి సీరియల్ నంబర్లను విడుదల చేశారు. అభ్యర్థులు పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఐటీఐ, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసు పుస్తకం, ఫొటోలు, డ్రైవింగ్ లైసెన్స్, ఏదైనా గుర్తింపు కార్డు తీసుకు రావాల్సి ఉంటుందని సూచించారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 18న నిర్వహించే రాత పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. ప్రసాద్‌బాబు, నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఏ చిన్నపొరబాటుకు తావివ్వొద్దని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను డీఈఓ ఆదేశించారు. గురువారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ, నవోదయ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,987 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అనంతపురం జిల్లాలో 15, శ్రీసత్యసాయి జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 18న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు గంటముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఏమాత్రం ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని డీఈఓ ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ పాల్గొన్నారు.

నీ నామమే మధురం సాయి..



సంగీత కచేరీలో పాల్గొన్న శ్రీసత్యసాయి యంగ్ అడల్ట్స్ బృందం

ప్రశాంతి నిలయం: సాయి భక్తులు చక్కటి భక్తి గీతాలతో నిర్వహించిన కచేరీ అలరించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేసిన శ్రీసత్య సాయి యంగ్ అడల్ట్స్ బృందం గురువారం సాయంత్రం సాయి సన్నిధిలో సంగీత విభావరి నిర్వహించింది. సత్యసాయి ప్రేమ తత్వాన్ని, సేవాభావాన్ని కొనియాడుతూ గంట పాటు సంగీత కచేరీ నిర్వహించారు. అనంతరం వారు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

కట్టుతప్పిన ఖాకీ

❒ అనంతపురం నగరంలో ఇంతియాజ్ అహమ్మద్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ఐదు రోజుల క్రితం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ ఏ. నారాయణ స్వామి, హోంగార్డు దాదాపీర్ చితకబాదారు. ఆర్టీఓ ఆఫీసు ప్రాంతం ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందని అడిగినందుకే ఆగ్రహంతో ఊగిపోయి నడిరోడ్డుపైనే విచక్షణా రహితంగా దాడి చేశారు. తనకు ఆపరేషన్ అయిందని బాధితుడు చెబుతున్నా వినకుండా కడుపుపై కొట్టారు. పైగా తమ విధులకు ఆటంకం కలిగించాడంటూ బాధితుడిపైనే కేసు నమోదు చేశారు.

❒ అనంతపురం నగరంలోని మారుతీ నగర్ ప్రాంతంలో ఇటీవల ఓ దుకాణ ఓనర్‌ను టీడీపీ నాయకుడు చితకబాదాడు. 'నేను అడిగితే అగ్గిపెట్టె ఇవ్వవా. అధికారం మాది గుర్తుపెట్టుకో' అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు తీసుకోలేదు. పైగా అతడిపైనే కేసు నమోదు చేశారు.

❒ గతేడాది డిసెంబర్ 27న అనంతపురం క్లాక్‌టవర్ సమీపంలో ప్రేమ్ అనే వ్యక్తితో పాటు మరో ఇద్దరిని ట్రాఫిక్ పోలీసులు చావబాదారు. మఫ్టీలో ఉంటూ చలానాలు రాస్తున్నారా? అని ప్రశ్నించినందుకే నానా దుర్భాషలాడి భౌతికదాడికి పాల్పడ్డారు. తిరిగి ప్రేమ్, అతని స్నేహితులపై కేసు నమోదు చేశారు.



- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్న కొందరు పోలీసులు
- ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ శాఖకు అప్రతిష్ట
- పైగా బాధితులపైనే రివర్స్ కేసులు
- 'పచ్చ'పాతం చూపుతూ విధులు
- పోలీసుల తీరుపై విమర్శలవెల్లువ





టవర్‌క్లాక్ వద్ద యువకుడిపై దాడి చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు, గాయపడిన ఇంజినీర్ ఇంతియాజ్ (ఫైల్)

అనంతపురం: ప్రజలకు భద్రత కల్పించాల్సిన కొందరు పోలీసులు అడ్డదారులు తొక్కుతున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటూ రెచ్చిపోతున్నారు. క్రమశిక్షణకు మారుపేరని చెప్పుకుంటూనే తమ విచ్చలవిడి ప్రవర్తనతో పోలీస్ ప్రతిష్టకే మచ్చ తెస్తున్నారు. బాధితులనే నిందితులుగా మార్చి రివర్స్ కేసులు కడుతూ అప్రతిష్ట మూటగట్టుకుంటున్నారు. పోలీసుల విపరీత ప్రవర్తనను చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నగరంలో మరీ దారుణం..

అనంతపురం నగరంలో అయితే కొందరి పోలీసుల తీరు మరీ దారుణంగా ఉంటోంది. వెలుగులోకి వస్తున్నవి కొన్ని మాత్రమే. భౌతికదాడులు, బెదిరింపులకు దిగుతున్నా చాలా మంది బాధితులు బయటకు చెప్పులేక లోలోన ఆవేదన చెందుతున్నారు. ఇటీవల త్రీ టౌన్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి అనుమానాస్పదంగా మృతి చెందారు. అయితే, న్యాయవాది మృతికి సీఐ శాంతిలాలే కారణమని, అతడిని సస్పెండ్ చేయాలని 15 రోజుల పాటు న్యాయవాదులు ఆందోళన చేశారు. త్రీ టౌన్ సీఐ, ఎస్‌ఐ కఠినంగా మాట్లాడటంతోనే గుండెపోటుకు గురై మృతి చెందాడని, బాధ్యులైన పోలీసు అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలంటూ నిరవధికంగా నిరసన తెలిపారు. అయినా, కనీసం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సీబీసీఐడీకి కేసు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ స్పందన లేకుండా పోయింది. న్యాయవాదుల పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రజల భయాందోళన..

సామాన్యులపై పోలీసు జులుం ప్రదర్శించి అకారణంగా దాడులు చేస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలంటేనే భయకంపితులవుతున్నారు. 'ఫ్రెండ్లీ పోలీసింగ్'కు కొత్త భాష్యం చెబుతూ సిబ్బంది రెచ్చిపోతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జనసేన నేత రెచ్చిపోయినా..!

కొన్ని రోజుల క్రితం జనసేన తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌రెడ్డి పోలీసులపై మీడియా ముఖంగానే రెచ్చిపోయి మాట్లాడాడు. తాడిపత్రి డీఎస్పీని ఉద్దేశిస్తూ "జీతాలు చాలక పక్కదార్లు పడుతున్నారు.. దో నెంబర్ దందాలకు ఇక్కడ తావులేదు.. బదిలీ చేయించుకొని మరోచోటకు వెళ్లండి" అని తీవ్రంగా విమర్శించారు. మరుసటి రోజు సీఐ సాయిప్రసాద్ శ్రీకాంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో వాదనకు దిగారు. ఎన్నికల సమయంలో జరిగిన కేసులపై విచారణ నిమిత్తం అంటూ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే, కేసు కట్టే సమయంలో అధికార పార్టీ నాయకులు స్టేషన్‌కు వచ్చి మంతనాలు జరిపి అతడిని బయటకు తీసుకెళ్లారు. తాజాగా టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి తనను బెదిరించాడని బేల్దారి రాం పుల్లయ్య చెబితే సీఐ వాగ్వివాదం చేసి తన పరువును తానే తీసుకుని ప్రజల ముందు గౌరవాన్ని పోగొట్టుకున్నారు.

ఖాకీ వర్సెస్ కామన్ మ్యాన్

- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఆడియో
- సీఐతో ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి పాత కేసులు తిరగదోడిన వైనం



సీఐ సాయిప్రసాద్

తాడిపత్రి టౌన్/ అనంతపురం: పట్టణానికి చెందిన ఓ సాధారణ వ్యక్తితో పట్టణ సీఐ సాయి ప్రసాద్ సంయమనం కోల్పోయి దూషించిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. సీఐ తన స్థాయి మరచి దూషణ పర్వానికి దిగగా, సదరు వ్యక్తి కూడా ఏ మాత్రం తగ్గకుండా అదే భాషలో సమాధానం ఇవ్వడం గమనార్హం.

అసలు జరిగిందేంటంటే...

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో నివాసం ఉంటున్న బేల్దారి రాంపుల్లయ్యను బెదిరించాడు. దీంతో బాధితుడు రాంపుల్లయ్య.. పట్టణ సీఐ సాయిప్రసాద్‌కు రెండు రోజుల క్రితం ఫోన్ చేశారు. "మీరు ఎలాగూ కేసు తీసుకోరు... నేనే జేసీ ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతా.. ఆయన ఫోన్ నంబర్ ఇవ్వండి" అని కోరాడు. ఆ తర్వాత సీఐ... 'నేనేందుకు నీకు ఫోన్ నంబర్ ఇవ్వాలి' అంటూ ప్రారంభించి చివరకు బూతుల వరకూ వెళ్లారు. సీఐ విచక్షణ కోల్పోయి సామాన్యుడి మాటలను మించి మాట్లాడడం, ఏకంగా 'నువ్వెక్కడ ఉన్నావో చెప్పు అక్కడకు వచ్చి నీ కథ చూస్తా' అంటూ రెచ్చిపోయిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

పోలీసుల అదుపులో రాంపుల్లయ్య?

సామాన్యుడితో సీఐ సంభాషణ వైరల్ కావడంతో ఎస్పీ జగదీష్ స్పందించారు. సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలోనే పోలీసులు గతంలో రాంపుల్లయ్యపై నమోదు చేసిన కేసులను తిరగదోడుతున్నారు. మరోవైపు అనంతపురం రెండో పట్టణ పోలీసులు రాంపుల్లయ్యను గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సీఐ సాయిప్రసాద్ కూడా దుర్భాషలాడినప్పటికీ ఆయనపై ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

భూ సమస్యలపై వినతుల వెల్లువ

- ఫోన్‌ఇన్‌లో కలెక్టర్‌తో గోడు వెళ్లబోసుకున్న బాధితులు



'ఆకాశవాణి ఫోన్ ఇన్' ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: తమ భూమికి సంబంధించి వేరొకరికి పాసుపుస్తకం ఇచ్చారని ఒకరు.... భూమిని ఆక్రమించారని మరొకరు... తమకు ఇచ్చిన భూమికి ఏళ్లు గడుస్తున్నా పాసుపుస్తకం ఇవ్వలేదని ఇంకొకరు... రీ సర్వేలో కొంత భూమి తగ్గిందని వేరొకరు... ఇలా పలువురు కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు నేరుగా ఫోన్ ద్వారా విన్నవించుకున్నారు. భూముల రీ-సర్వే అంశంపై కలెక్టర్ గురువారం అనంతపురం ఆకాశవాణి కేంద్రం నుంచి 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ ఆనంద్, సర్వే, భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్, ఆకాశవాణి ప్రోగ్రాం డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

ఫిర్యాదు: నా పేరు నారాయణస్వామి. మాది తాడిపత్రి మండలం యనమకూరు. సర్వే నంబరు 47బీలో 2.87 ఎకరాల భూమి 1962 నుంచి మా తండ్రి ఆధీనంలో ఉండింది. 1995లో ఉపాధి కోసం బెంగుళూరు వెళ్లాం. 2014లో మా భూమిని వేరొకరు వారి పేరున పాసుపుస్తకం చేయించుకున్నారు. కలెక్టరేట్‌లో చాలా సార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. మాకు ఇచ్చిన డి.పట్టా ఎక్కడో మిస్ అయింది. అయితే మా భూమిపైన బ్యాంకు నుంచి తీసుకున్న లోనుకు సంబంధించిన డాక్యుమెంట్లు ఉన్నాయి. వాటిని పరిశీలించి సమస్య పరిష్కరించాలి.

కలెక్టర్: మీ వద్ద ఉన్న ఆధారాలను తీసుకువస్తే పరిశీలించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. భూములకు సంబంధించి పత్రాలు జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి.

ఫిర్యాదు: నా పేరు బాలకృష్ణారెడ్డి. మాది బుక్కరాయసముద్రం సిద్దరామాపురం. వెటర్నరీ ఫారమ్ ఏర్పాటు కోసం 30 మంది రైతుల నుంచి సర్వే నంబరు 144, 146-1, 190, 200- 1,2,3, 265, 275లో 76.55 ఎకరాలను ప్రభుత్వం 1961లో తీసుకుంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా 1973లో ఇచ్చిన భూమిని సాగు చేసుకుంటున్నాం. అయితే ఇప్పటి వరకు పాసుపుస్తకాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు అందుకోలేకపోతున్నాము. సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నాం.

కలెక్టర్: మీసేవ ద్వారా పట్టాదారు పాసుపుస్తకం కోసం తహసీల్దారుకు దరఖాస్తు చేసుకోండి. వారు విచారణ చేసి పాసుపుస్తకం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు.

ఫిర్యాదు: నా పేరు రామాంజినేయులు. కంబదూరు మండలం మల్లెనిపల్లె గ్రామం. మా భూమిలో ఎకరా స్థలాన్ని ఇద్దరు వ్యక్తులు ఆక్రమించారు. పొలానికి వెళ్లేందుకు దారిలేక ఇబ్బంది పడుతున్నాం. తగిన చర్యలు తీసుకోవాలి.

కలెక్టర్: మీ సమస్యపై ఆర్‌డీఓ, తహసీల్దారుకు ఆదేశాలు ఇస్తాం. విచారణ చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు సమస్యను పరిష్కరిస్తారు.

ఫిర్యాదు: నా పేరు యానాసిరెడ్డి. తాడిపత్రి మండలం బొమ్మలపూడి గ్రామం. రీ సర్వేలో మాకున్న భూమి కంటే 25 సెంట్లు తగ్గింది. సరి చేయించి న్యాయం చేయాలి.

కలెక్టర్: తహసీల్దారుకు దరఖాస్తు చేసుకోండి. వారు మళ్లీ సర్వే చేయిస్తారు. మీ వద్ద ఉన్న పత్రాలలో ఉన్న లెక్కల ప్రకారం అనుభవిస్తున్న భూమిని ఈ సర్వే ద్వారా చూపిస్తారు.

రహదారి భద్రతపై విస్తృత అవగాహన

అనంతపురం అర్బన్: 'జాతీయ రహదారి భద్రతపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలి. ఫిబ్రవరి 15వ తేదీ వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను మొక్కుబడిగా కాకుండా ప్రజా ప్రయోజనకారిగా నిర్వహించాలి' అని కలెక్టర్ వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మాసోత్సవాల బ్యానర్, కరపత్రాలు, పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్లు, రిటైర్డ్ ఏపీఎస్‌ఆర్టీసీ సిబ్బందితో కలిసి వలంటీర్లను గుర్తించి 17న శిక్షణ ఇవ్వాలన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 21వ తదీ వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఏఎస్పీ డి.వి.రమణమూర్తి, డీటీసీ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

- వైఎస్సార్‌సీపీ నేత ఇంటి చుట్టూ నాటిన మొక్కలు, బండల ధ్వంసం



బండలను ధ్వంసం చేసిన దృశ్యం

రాప్తాడు: కక్ష కట్టారు.... పక్కాగా స్కెచ్ వేశారు... రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే దౌర్జన్యాలకు తెరలేపారు. రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ నేతల దౌర్జన్యాలు పరాకాష్టకు చేరుకున్నాయనేందుకు అద్దం పట్టింది బొమ్మేపర్తి విధ్వంసం. బాధితులు తెలిపిన మేరకు...

మూడు దశాబ్దాల కక్ష

దాదాపు 30 సంవత్సరాల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆదేశాల మేరకు రాప్తాడు మండలం బొమ్మేపర్తిలోని సర్వే నంబర్ 147, 148లో లే అవుట్ వేసి నివేశన స్థలాలు మంజూరు చేశారు. ఒక్కొక్కరికి 2 సెంట్ల చొప్పున దాదాపు 264 మందికి అప్పట్లో పట్టాలను అందజేశారు. ఈ క్రమంలో తమకు మంజూరైన 195, 196 ప్లాట్లలో ఆనందరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పక్కా గృహాన్ని నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ రెండు ప్లాట్లకు తూర్పు, పడమర వైపున రస్తా ఉంది. లే అవుట్ వేసినప్పుడు ఇచ్చిన స్కెచ్‌లోనూ పక్కాగా ఈ రస్తానే చూపించారు. అయినా స్థానిక టీడీపీ నాయకులు మొండి శ్రీనివాసులు, రామలింగమయ్య, రామకృష్ణ, తిప్పమ్మ, ఉదయ్‌కుమార్ ఏకమై తూర్పు వైపు రస్తా లేదంటూ దౌర్జన్యానికి దిగి కబ్జా చేశారు. రస్తా చుట్టూ బండలు పాతారు. తన ఇంటికి తూర్పు వైపు రస్తా ఉందని ఆనంద్ రెడ్డి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ హయాంలో అధికారులు, పోలీసులు స్పందించలేదు. అనంతరం చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలతో ఆనందరెడ్డి కుటుంబసభ్యులు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారు. దీంతో టీడీపీ నేతలు మరింత కక్ష కట్టారు.

న్యాయస్థానం ఆదేశాలతో...

రస్తా వివాదంపై అధికారులు స్పందించకపోవడంతో ఆనందరెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. దీనిపై ఇంజక్షన్ ఆర్డర్‌ను న్యాయస్థానం వెలువరించడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటికప్పుడు అధికారులు, పోలీసులు స్పందించి రస్తా సమస్యకు పరిష్కారం చూపారు. రస్తాకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. అప్పటి నుంచి మూడేళ్ల వరకూ టీడీపీ నాయకులు రస్తా జోలికి వెళ్లకుండా మిన్నకుండిపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తమ కుట్రలకు తెరలేపారు. గురువారం ఉదయం ఆనందరెడ్డి దంపతులు తోటకు వెళ్లిన సమయంలో వారి ఇంటికి తూర్పున ఉన్న బండలను జేసీబీతో పెకలించి ధ్వంసం చేశారు. అక్కడ నాటిన మొక్కలనూ తొలగించారు. రస్తాపై పునాది వేసేందుకు జేసీబీతో గుంతలు కూడా తవ్వించారు. ఇదేమని ప్రశ్నిస్తే ఊరు విడిచి వెళ్లకపోతే హతమారుస్తామంటూ తమను టీడీపీ నేతలు బెదిరిస్తున్నారని బాధితులు వాపోయారు. అధికారులు స్పందించి రస్తా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

రీ-సర్వే ఫిర్యాదులు పక్కాగా పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: భూముల రీ-సర్వేపై అందిన ఫిర్యాదులను పక్కాగా పరిష్కరించాలని సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు రెడ్డి ఆదేశించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సమగ్ర భూ సర్వే నిర్వహించారు. జిల్లాలో 198 గ్రామాల్లో 1.83 లక్షల భూ కమతాలకు సంబంధించి 5.88 లక్షల ఎకరాలను రీ సర్వే చేశారు. ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ-సర్వే ఫిర్యాదుల స్వీకరణకు 198 గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. ఈ క్రమంలో రీ-సర్వేపై 5,321 ఫిర్యాదులు అందాయి. ఇందులో సర్వేకు సంబంధించి 4,377, రెవెన్యూకు చెందినవి 789, కోర్టు కేసులకు సంబంధించి 305 ఫిర్యాదులు అందాయి. వీటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామసభల్లో అందిన ఫిర్యాదులను ప్రత్యేక అధికారి గురువారం సర్వే, భూ రికార్డుల శాఖ ఏడీ కార్యాలయంలో ఏడీ రూప్లానాయక్‌తో కలిసి పరిశీలించారు. సర్వే ఫిర్యాదుల పరిష్కారంపై వైటీ చెరువు విలేజ్ సర్వేయర్, గుంతకల్లు మండల సర్వేయర్, గుంతకల్లు డీఐఓలను, మరి కొన్ని గ్రామాలకు చెందిన అధికారులను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వేపై గ్రామసభల్లో అందిన ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కరించాలన్నారు.



రీ-సర్వేపై అందిన ఫిర్యాదులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి శ్రీనివాసులురెడ్డి, చిత్రంలో ఏడీ రూప్లానాయక్

ఫీజు మినహాయింపు..

జాయింట్ ఎల్‌పీఎంకు సంబంధించి సబ్‌డివిజన్ చేసుకునేందుకు ఆరు నెలల పాటు ఫీజు మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏడీ రూప్లానాయక్ తెలిపారు. చలానా కేవలం రూ.50 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ అవకాశాన్ని భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

● ఎంత కష్టం తల్లీ.. బిడ్డను తీసుకెళ్లడం



కూటమి ప్రభుత్వం వచ్చాక 108,104, 102 (తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్) వ్యవస్థ నిర్వీర్యమైపోతోంది. వాహనాలు మరమ్మతులకు నోచుకోక ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. కూడేరులోని పీహెచ్‌సీలో గురువారం ఉదయం కలగళ్లకు చెందిన ఓ గర్భిణీ మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డను ఇంటికి చేర్చేందుకు ఆస్పత్రి సిబ్బంది 102కి సమాచారమివ్వగా.. అనంతపురం నుంచి వాహనం వచ్చింది. అయితే, బిడ్డతో కలిసి బాలింత వాహనంలోకి ఎక్కాక వాహనం స్టార్ట్ కాలేదు. స్థానికులు చాలా సేపు తోసినా ప్రయోజనం లేకుండా పోయింది. గంటల తరబడి నిరీక్షించినా ఫలితం లేకపోవడంతో చేసేదిలేక బాలింతను కుటుంబ సభ్యులు సొంతఖర్చులతో ఇంటికి తీసుకెళ్లారు. – కూడేరు

క్లుప్తంగా

ఆర్టీసీ డిపో ఎస్టీఐ అక్రమాలపై విచారణ



ఎస్టీఐ రమణమ్మ సంతకాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి

ఉరవకొండ: స్థానిక ఆర్టీసీ డిపోలో ఎస్టీఐగా పనిచేస్తున్న రమణమ్మ విధుల్లో అక్రమాలకు పాల్పడినట్లు వెల్లువెత్తిన ఫిర్యాదులపై గురువారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. డిపో ఆవరణలోని డీఎం కార్యాలయంలో రికార్డులను విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది పరిశీలించారు. ఎస్టీఐ రమణమ్మ వీక్లీ ఆఫ్ తీసుకున్నా తాను విధులు నిర్వర్తించినట్లు సంతకాలు పెడుతున్నట్లు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పాటు దొంగ మస్టర్‌లు సృష్టించి ఆర్టీసీ ఆదాయాన్ని పక్కదారి పట్టించినట్లు సమాచారం. దాదాపు 70 మంది ఆర్టీసీ కార్మికులు లిఖిత పూర్వకంగా ఎస్టీఐపై ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ అధికారులు ఆకస్మాత్తుగా విచారణ చేపట్టారు.

రూఫ్ వాటర్ హార్వెస్టింగ్‌పై దృష్టి పెట్టండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం అర్బన్: ఉపాధి పథకం కింద రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, వ్యక్తిగత, కమ్యూనిటీ సోక్ పిట్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఉపాధి పథకం, పంచాయతీ సెక్టర్‌పై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్షించారు. ఉపాధి పథకం కింద రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను పాఠశాలలు, సచివాలయ భవనాలు, ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలంలో వారానికి 25 వ్యక్తిగత సోక్ పిట్లు, వారానికి ఒకటి చొప్పున కమ్యూనిటీ సోక్ పిట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రీన్ అంబాసిడార్లకు వేతనాలు చెల్లించడంలో అలసత్వం వీడాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ సలీమ్‌బాషా, డీపీఓ నాగరాజునాయుడు, పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అనంతపురం: నగరంలోని సాయినగర్ మొదటి క్రాస్, రామన్ స్కూల్ సమీపంలో బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు... రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమై గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రామన్ స్కూల్ వద్ద బొలెరో వాహనంలో తరలిస్తున్న 2,146 కిలోల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, పుట్టపర్తి మండలం బుగ్గపల్లికి చెందిన గుడిపాటి హరికృష్ణ, అనంతపురంలోని సాయినగర్ మొదటి క్రాస్‌కు చెందిన పసుపుల సురేష్‌ను అరెస్ట్ చేశారు.



వందే భారతం.. గుడిసెలే ఆవాసం

'వికసిత్ భారత్'... 'స్వర్ణాంధ్రప్రదేశ్'... అంటూ అంతా పరితపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధమైన పరిస్థితులున్నాయి. అనంతపురం శివారున ఉన్న రాజీవ్ కాలనీలోని ఈ చిత్రం వాస్తవ భారతానికి ప్రతీకగా నిలుస్తోంది. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి ఏడు దశాబ్దాలకు పైగా గడిచినా పేదరికం ఛాయలు వీడలేదు. సొంతిల్లు లేక ఎందరో ప్రభుత్వ పొరంబోకు భూముల్లో గుడిసెలు వేసుకుని నేటికీ జీవనం సాగిస్తున్నారు. ఓ వైపు అభివృద్ధి పట్టాలపై వందే భారత్ పరుగులు తీస్తుండగా... అదే పట్టాల పక్కన వలస కూలీలు సాగిస్తున్న దుర్భర జీవనం పాలకుల కంటికి కనిపించకపోవడం విశేషం. అభివృద్ధికి ఒక వైపు మాత్రమే చూస్తున్న పాలకుల దృష్టి మారనంత వరకూ పేదల జీవితాలు ఇలాగే ఉంటాయనే వాదన వినిపిస్తోంది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

'బాల'లకు అందని 'ఆధార'ం

- బాలల ఆధార్‌పై అంతులేని నిర్లక్ష్యం
- తల్లిదండ్రులకు కొరవడిన అవగాహన
- ఎక్కువ శాతం మంది పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు లేని వైనం
- ఆధార్ అందజేయడంలో అనంత వెనుకంజ



అనంతపురం సెంట్రల్: 'ఆధార్'... ప్రస్తుతం అన్నింటికీ అత్యంత ఉపయోగకరమైన వనరు ఇదే కావడంతో ఆధార్ కార్డుకు డిమాండ్ నెలకొంది. భారత దేశ పౌరునిగా గుర్తింపు కోసం తొలుత ఆధార్ కార్డునే పరిశీలనకు తీసుకుంటున్నారు. ఇంతటి విలువైన ఆధార్ కార్డును బాలలకు అందజేయడంలో అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఐదేళ్ల వయసున్న పిల్లలందరికీ ఆధార్ కార్డులు అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే జిల్లాలో ఆశించిన స్థాయిలో ఈ కార్యక్రమం ముందుకు సాగడం లేదు. క్షేత్రస్థాయిలో అధికారుల మధ్య సమన్వయ లోపం, తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. జిల్లాలో 2,280 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు మూడేళ్ల నుంచి ఐదేళ్ల లోపు లోపు పిల్లలందరికీ పౌష్టికాహారం అందజేస్తున్నారు. దీంతో ఆ వయసు పిల్లలకు ఆధార్ కార్డులు అందజేసే బాధ్యతను ఐసీడీఎస్ అధికారులకే ప్రభుత్వం అప్పగించింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ ఆరు నెలల్లోపు చిన్నారులు 13,280 మంది, 7 నుంచి 36 నెలల్లోపు చిన్నారులు 79,994 మంది, 37 నుంచి 72 నెలల్లోపు చిన్నారులు 69,020 మంది చిన్నారులకు ఆధార్ కార్డులు అందలేదు.

అవగాహన కల్పించడంలో విఫలం

ఆధార్ కార్డు ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో క్షేత్రస్థాయిలో అధికారుల వైఫల్యం కనిపిస్తోంది. దీంతో ఎక్కువశాతం తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధార్ కార్డులు పొందలేకపోతున్నారు. దీనికి తోడు బర్త్ సర్టిఫికెట్లు లేకపోవడం మరో సమస్యగా మారింది. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పోస్టాఫీసులు, ఈ- సేవా కేంద్రాల్లో ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతోంది. అయినా ఆయా కేంద్రాలకు తల్లిదండ్రులు వెళ్లడం లేదు. దీంతో భవిష్యత్‌లో పిల్లలు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.

ప్రాజెక్టుల వారీగా ఆధార్‌కార్డులు అందని చిన్నారుల సంఖ్య

ప్రాజెక్టు	6 నెలల లోపు	7-36 నెలల్లోపు	37-72 నెలల్లోపు
అనంతపురం రూరల్	1,329	3,742	313
అనంతపురం అర్బన్	994	3,456	1,154
గుత్తి	1,692	6,872	3,655
కళ్యాణదుర్గం	754	3,296	1,654
కంబదూరు	936	3,911	1,731
కణేకల్లు	984	3,653	1,731
నార్పల	596	2,900	580
రాయదుర్గం	1,640	5,767	2,561
శింగనమల	966	2,697	887
తాడిపత్రి	1,652	4,343	841
ఉరవకొండ	1,595	6,009	1,971

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం



అంగన్‌వాడీ సెంటర్ స్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డులు అందించేలా చర్యలు చేపట్టాం. ఈ విషయంగా అంగన్‌వాడీ వర్కర్, సూపర్‌వైజర్, సీడీపీఓలను అప్రమత్తం చేశాం. ఈ నెలాఖరు లోపు ప్రతి చిన్నారికీ అందించాలని ఆదేశాలు జారీ చేశాం. అయితే క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులు ముందుకు రాకపోవడం, బర్త్ సర్టిఫికెట్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – వనజా అక్కమ్మ , ప్రాజెక్టు డైరెక్టర్, మహిళాశిశు సంక్షేమశాఖ

అనంత వేదికగా లఘు చిత్రాల పండుగ



వివరాలు వెల్లడిస్తున్న దర్శకుడు రషీద్

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా మరో లఘు చిత్రాల పండుగ ఈ నెలలో ప్రారంభం కానుంది. అనేక ప్రాంతాల నుంచి విచ్చేసే బుల్లితెర నటీనటులతో మరో చిత్రోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం అనంతపురం ఫిలిం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సినీ దర్శకుడు రషీద్ బాషా, టీవీ–సినీనటుడు రమేష్ నీల్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీధర్, సీనియర్ డ్యాన్స్ మాస్టర్ కత్తి విజయ్‌కుమార్, సామాజిక సేవా కార్యకర్త తోట బాలన్న తదితరులు మాట్లాడారు. గతంలో అనంత వేదికగా 6 సార్లు లఘు చిత్రోత్సవం నిర్వహించినట్లు గుర్తు చేశారు. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తూ మరోసారి 18 కేటగిరీలలో ఉత్తమ చిత్రాలకు, సాంకేతిక నిపుణులకు, నటీనటులకు, డైరెక్టర్లకు ఉత్తమ పురస్కారాలనందిస్తామన్నారు. ఇప్పుడిప్పుడే రాణిస్తున్న దర్శక, నిర్మాతలను ప్రోత్సహించేందుకు జీఎంఎస్ గ్యాలరీ సహకారంతో రూ.50 వేల బడ్జెట్‌తో తామే లఘు చిత్రం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25వ తేదీలోపు ఎంట్రీలను పంపాలని కోరారు. పూర్తి వివరాలకు 96763 50651, 72880 22467 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వరి సాగులో మెలకువలు పాటించండి



రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: జిల్లాలో రబీ సీజన్ కింద చేపట్టిన వరి సాగులో మెలకువలు పాటించాలని రైతులకు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. గురువారం 'సాక్షి'తో ఆమె మాట్లాడుతూ... జిల్లాలో బోరు బావుల కింద వరి సాగుపై రైతులు దృష్టి సారించారన్నారు. ఈ క్రమంలో నాణ్యమైన విత్తన ఎంపిక చాలా ముఖ్యమన్నారు. కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండైజిం కలిపి 24 గంటల తరువాత నార మడిలో చల్లుకోవాలనాన్నారు. దంప నార మళ్లక అయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండైమ్ కలిపి ఆ ద్రావణంలో వరి విత్తనాలను 24 గంటలు నానబెట్టి వరి మొలక వచ్చిన తరువాత నార మడులో చల్లుకోవాలన్నారు. ఎకరాకు 20 నుంచి 25 కిలోల వరి విత్తనం అవసరమవుతుందన్నారు. గరుకు భూముల్లో 30 కిలోలు వేసుకోవాలని సూచించారు. వరి మలక చల్లుకునే ముందు నార మడులను బాగా దుక్కి చేసుకోవాలన్నారు. మడిలో నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా ఏర్పాటు చేయాలన్నారు. 5 సెంట్ల నారమడికి 2 కిలోల నత్రజని ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఎరువులను నార మలక ముందు దుక్కిలో వేయాలన్నారు. మడిలో నార ఆకు పూర్తిగా విచ్చుకునే వరకూ పలచగా నీటి తడులు ఇస్తూ, తొలగిస్తూ ఉండాలన్నారు. నార మడులలో జింక్ లోపం ఉంటే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేటు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. నార విత్తనం వేసిన 10 రోజులకు కార్బోఫ్యూరాజిన్ 3జి లేదా 4జి గుళికలు సెంటు నారమడికి 160 గ్రాముల చొప్పున లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లేదా క్లోరోపైరిఫాస్ 2.0 మిల్లీ లీటరు నీటికి కలిపి 10 రోజులకు, 17 రోజులకు పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. మడిలో నార తీసేందుకు 7 రోజుల ముందు కార్బోఫ్యూరాజిన్ గుళికలు వేయాలని, బీపీటీ వరి నార అయితే 2 నెలల తర్వాత నాటుకోవాలి. 1010 వరి రకం అయితే 30 రోజులకు నాటుకోవాలని సూచించారు.

మద్యపాన నిషేధిత గ్రామంగా బోర్డు ఏర్పాటు

- ఆదర్శంగా నిలిచిన వదనకల్ గ్రామస్తులు
- మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధించాలని డిమాండ్



బోర్డు ఏర్పాటు చేసిన గ్రామస్తులు

పావగడ: తమ గ్రామంలో మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధించి శాంతి భద్రతలు నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ వదనకల్ గ్రామస్తులు గురువారం వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. గ్రామ నడిబొడ్డున 'మద్యపాన నిషేధిత గ్రామం' అని బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖుడు బ్రహ్మేంద్రచార్ మాట్లాడారు. గ్రామంలో మద్యం విక్రయాలతో మందు బాబుల బెడద ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా యువకులు మద్యానికి బానిసై పెడదారి పడుతున్నారన్నారు. సాయంత్రం గ్రామంలో మహిళలు స్వేచ్ఛగా బయట తిరగలేకపోతున్నారన్నారు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా మద్యం విక్రయాలను అరికట్టలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్తులంతా సమావేశమై చర్చించుకున్న అనంతరం తమ గ్రామాన్ని మద్యపాన నిషేధిత గ్రామంగా పేర్కొంటూ గ్రామ నడిబొడ్డున బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో మద్యం అమ్మకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్‌ను కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. అనంతరం ఇకపై తమ గ్రామంలో మద్యం విక్రయాలు చేపట్టకూడదని విక్రయదారులను హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొన్న కారు



రాముడుకు సపర్యలు చేస్తున్న స్థానికులు

బత్తలపల్లి: స్థానిక జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు... తాడిమర్రికి చెందిన బండారు రాముడు ద్విచక్రవాహనంపై గురువారం ముదిగుబ్బ మండలం గొంగటిలింగాయపల్లిలో సమీప బంధువుల ఇంట శుభకార్యానికి హాజరయ్యారు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన బత్తలపల్లి మండలం రామాపురం కూడలి వద్ద జాతీయ రహదారిని క్రాస్ చేస్తుండగా అనంతపురం నుంచి కదిరి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో రాముడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రునికి స్థానికులు సపర్యలు చేసి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మట్టి దొంగకే 'మైనింగ్' మద్దతు!

- లేపాక్షి హబ్‌లో ఆ పోలీసు మట్టి అక్రమ తవ్వకాలపై నామమాత్రపు విచారణ



ఈ నెల 9న లేపాక్షి నాలెడ్జ్ హబ్‌లో తనిఖీలు చేస్తున్న మైనింగ్ శాఖ అధికారులు (ఫైల్)

చిలమత్తూరు: వడ్డించేవాడు మనవాడైతే.. బంతిలో చివర కూర్చున్నా అన్నీ అందుతాయి అనేది నానుడి. అచ్చం ఇలాగే మారింది ఓ ఎస్‌ఐ అక్రమ మట్టి తవ్వకాలపై విచారణ. రాప్తాడు నియోజకవర్గంలో పని చేస్తున్న ఎస్‌ఐ మట్టి అక్రమ తవ్వకాలపై 'పోలీసే మట్టి దొంగ' శీర్షికన ఈ నెల 5న 'సాక్షి'లో వెలువడిన కథనం విదితమే. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిన మైనింగ్ అధికారులు తీరుబడిగా ఈ నెల 9న హబ్ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టిన ప్రాంతాన్ని గుట్టు చప్పుడు కాకుండా పరిశీలించి వెళ్లారు. అనంతరం సంక్రాంతి సెలవులు రావడంతో ఈ విషయాన్ని స్థానికులు మర్చిపోతారనే భావించారు. విచారణను సైతం నామమాత్రంగానే నిర్వహించి, వివరాలను గోప్యంగా ఉంచారు. సదరు ఎస్‌ఐ కొనుగోలు చేసిన భూమి వాలుగా ఉండడంతో దానిని చదును చేసేందుకు ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న లేపాక్షి నాలెడ్జి హబ్‌లోని భూముల నుంచి వందలాది టిప్పర్ల మట్టిని వారం రోజుల పాటు తరలించారు. జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన పోలీసు అధికారినే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ కోర్టు పరిధిలోని భూముల్లో అక్రమంగా చేపట్టిన మట్టి తవ్వకాలపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోడూరు వద్ద ఇలాగే ఓ భూ యజమాని అక్రమంగా మట్టి తరలించడంతో రూ. 2 కోట్ల మేర జరిమానా విధించారు. అయితే ఎస్‌ఐపై మాత్రం ఎలాంటి చర్యలూ లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి నేతల అండతోనే మట్టి అక్రమ తరలింపుల వ్యవహారం నీరుగారిపోయిందనే ఆరోపణలు వినవస్తున్నాయి. తన అక్రమాలపై కథనం ప్రచురితం కాగానే సదరు ఎస్‌ఐ ఆగమేఘాలపై ఇద్దరు ఎమ్మెల్యేలను ఆశ్రయించి ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకెళ్లినట్లుగా తెలుస్తోంది. దీంతో మనోడే కదా అని వదిలేస్తారా? లేదా చర్యలు తీసుకుంటారా? అనేది వేచి చూడాలి.

'నా స్థలంలో మృతదేహాన్ని ఎలా ఖననం చేస్తారు?'

సాక్షి, టాస్క్‌ఫోర్స్: దశాబ్దాలుగా సాగులో ఉన్న తన పొలంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రెబ్బల నాగమ్మ (95) మృతదేహాన్ని ఉద్దేశపూర్వకంగా ఖననం చేశారని, ఇలా ఎలా చేస్తారంటూ అధికారులను రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన దివ్యాంగ రైతు చిర్లా లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. ఘటనపై గురువారం రామగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుంటిమద్ది గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 388-3లో 4.9 ఎకరాల భూమిని 30 ఏళ్ల క్రితం కొనుగోలు చేసినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రెబ్బల శ్రీరాములు, రెబ్బల రామకృష్ణయ్య తల్లి నాగమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందితే దౌర్జన్యంగా తన పొలంలో మృతదేహాన్ని పాతిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి సందర్భంగా కుటుంబసభ్యులతో కలసి తాను ఊరెళ్లాలని, వచ్చిన తర్వాత ఈ విషయం తెలియడంతో ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో శ్మశాన వాటిక ఉన్నా.. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఇదే విషయమై తహసీల్దార్‌కూ బాధితుడు ఫిర్యాదు చేశాడు.

నెట్టికంటుడిని దర్శించుకున్న రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్



స్వామి తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ పి.హరినాథ్‌గుప్త, తెలంగాణ రాష్ట్ర ఆదిలాబాద్ జిల్లా మాజీ ప్రిన్సిపల్ జడ్జి జి.గోపాలకృష్ణ... గురువారం సాయంత్రం కసాపురం నెట్టికంటి స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో పట్టపగలే దుండగులు రెండిళ్లలో చోరీ చేసి పోలీసులకు సవాల్ విసిరారు. వివరాలు.. పెద్దవడుగూరు నుంచి గుత్తికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న గంగిరెడ్డి అలియాస్ ఉత్తమరెడ్డి గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం 1.45 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే తాళం పగులగొట్టి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించాడు. బీరువాలోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ ఆంజనేయులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బీరువాలోని మూడున్నర తులాల బంగారు నగలు, 30 తులాల వెండి, రూ.20 వేల నగదు అపహరించినట్లు బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అలాగే చిన్నవడుగూరు గ్రామంలో హనుమంతు గురువారం మధ్యాహ్నం తన ఇంటికి తాళం వేసి పెద్దవడుగూరులో హోటల్‌లో భోజనానికి వచ్చాడు. అనంతరం ఇంటికి వెళ్లే సరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలకు వెళ్లి పరిశీలిస్తే బీరువాలోని రెండున్నర తులాల బంగారు నగలు, రూ.20 వేలు నగదు అపహరించుకెళ్లినట్లు నిర్ధారించుకుని చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి



మృతి చెందిన గొర్రె పిల్లలను చూపుతున్న కాపరి కుటుంబసభ్యులు

శింగనమల: వీధి కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందాయి. శింగనమల మండలం సోదనపల్లిలో గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కర్రీ సూర్యనారాయణ... జీవాల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన గొర్రెల మందకు పెద్దకుంట వద్ద దొడ్డి ఏర్పాటు చేసుకుని రాత్రి సమయంలో అక్కడే విడిది చేయిస్తున్నాడు. గురువారం ఉదయం గొర్రె పిల్లలను ఓ దొడ్డిలో వేసి, మిగిలిన వాటిని మేపునకు తోలుకెళ్లాడు. మధ్యాహ్నం గొర్రెల దొడ్డిలోకి వీధి కుక్కలు చొరబడి దాడి చేయడంతో 24 గొర్రె పిల్లలు మృతి చెందాయి. సాయంత్రం తిరిగి వచ్చిన కాపరి మృతి చెందిన గొర్రె పిల్లలను గమనించి బోరున విలపించాడు. దాదాపు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి తెలిపాడు.

నీటి చౌర్యాన్ని అరికట్టాలి

- హెచ్చెల్సీ ఎస్‌ఈకి పండ్లతోటల రైతు సంఘం నాయకుల వినతి

అనంతపురం సెంట్రల్: పీఏబీఆర్ కుడికాలువ కింద అన్ని చెరువులను నీటితో నింపాలని జిల్లా పండ్లతోటల రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్‌ను కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. పీఏబీఆర్ నుంచి కుడి కాలువ ద్వారా చెరువులకు విడుదల చేసిన నీటిని ఇటీవల పరిశీలించినట్లు తెలిపారు. అయితే కూడేరు మండలం సమీపంలో ఉదిరిపికొండ, వడ్డుపల్లి తదితర ప్రాంతాల్లో కొంతమంది కాలువకు గండ్లు కొట్టి నీటిని అనధికారికంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. దీని వల్ల దిగువ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. వెంటనే నీటి చౌర్యాన్ని అరికట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అనంతరాముడు, నారపరెడ్డి, ఆనంద్, మురళీమోహన్ చౌదరి, వెంకటేశ్‌చౌదరి, చల్లా రామాంజనేయులు, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

రాయదుర్గంటౌన్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు రాకపోకలు సాగించేందుకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేసినట్లు సౌత్ వెస్ట్రన్ రైల్వే హుబ్లీ డివిజన్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించడానికి ఇప్పటికే కోట్లాది మంది తరలివెళుతున్నారు. ఫిబ్రవరి 26వ తేదీ వరకూ కుంభమేళా జరగనుంది. ఈ క్రమంలో నెలలో ఒక ట్రిప్పు చొప్పున జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాల్లో రాయదుర్గం, బళ్లారి మీదుగా మైసూరు–దానాపూర్–మైసూర్ ప్రత్యేక రైలును నడుపుతున్నారు. జనవరి 18, ఫిబ్రవరి 15, మార్చి 1 తేదీ శనివారాల్లో మైసూరులో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరిన రైలు (06207) బెంగళూరు, చిత్రదుర్గ, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంట్, హుబ్లీ, విజయపుర, సత్నా, ప్రయాగ్‌రాజ్ మీదుగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్‌కు చేరుకుంటుంది. అలాగే జనవరి 22న, ఫిబ్రవరి 19, మార్చి 5న బుధవారాల్లో దానాపూర్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత 1.45 గంటలకు బయలుదేరిన రైలు (06208) అదే స్టేషన్ల మీదుగా మైసూరుకు చేరుకుంటుంది.

క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనిల్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భాగ్యమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులంతా హాజరవుతారన్నారు. మండలస్థాయి అధికారులంతా హాజరై, తమ ప్రగతి నివేదికలను తెలియజేయాలన్నారు.

రైతువాణి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రిజ్వాన్, రైతు సంఘం నాయకులు

కనగానపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏపీ రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో రైతువాణి క్యాలెండర్, డైరీలను ఎస్ఐ రిజ్వాన్ ఆవిష్కరించారు. రైతు సోదరులకు అన్ని విధాలుగా ఉపయోగపడేలా వీటిని రూపొందించినట్లు ముద్రించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బత్తల కదిరప్ప, జేవీ రమణ, ఎస్ఎఫ్ఐ నాయకుడు నాగార్జున పాల్గొన్నారు.

'ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకోవద్దు'



మాట్లాడుతున్న ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్ బాషా

అనంతపురం కల్చరల్: ముస్లింలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్న వారికి తగిన బుద్ధి చెప్పే విధంగా చైతన్యవంతం చేస్తామని ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్ బాషా అన్నారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘాన్ని బలోపేతం చేయడానికి మహిళా కమిటీలు వేశామన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేయించుకుని తర్వాత ఇచ్చిన హామీలను రాజకీయ నాయకులు మరచిపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 25న అనంతలో ముస్లిం మైనార్టీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఎం సభ్యులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

అనంతపురం కల్చరల్: భీమవరానికి చెందిన డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో అనంతవాసులు ప్రతిభ కనబరిచినట్లు నిర్వాహకులు మురళీకృష్ణ, దాయన చంద్రాజీ తెలిపారు. గత నెలలో గురుపరంపర ప్రచారాన్ని కొనసాగిస్తూ పీఠాధిపతులు రచించిన 'భర్గిణీదేవి' పద్య కావ్యంపై రెండు తెలుగు రాష్ట్రాల వారికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దాదాపు రెండు వందల మంది పండితులు, వ్యాసకర్తలు పాల్గొన్న పోటీల్లో నగరానికి చెందిన డాక్టర్ పతికి రమేష్ నారాయణ, విజయ్ సాయికుమార్ వ్యాసాలు బహుమతులకు ఎంపికయ్యాయి. ఈనెల 23న భీమవరంలో జరిగే సాహితీ సదస్సులో వారు 9వ పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ ఆలీషా, చారిత్రక పరిశోధకులు బేతవోలు రామబ్రహ్మం తదితరులు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకోనున్నారు. ఉత్తమ ప్రతిభతో రాణించిన అనంత వాసులను సాహిత్య భారతి, ఉమర్ ఆలీషా సాహితీ సమితి అనంతపురం శాఖ ప్రతినిధులు అభినందించారు.

తెలుగు కీర్తి జాతీయ పురస్కారానికి ఎంపిక



డాక్టర్ బత్తల అశోక్ కుమార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, తెలుగు భారతి విభాగం పోస్ట్ డాక్టరల్ పరిశోధన విద్యార్థి డాక్టర్ బత్తల అశోక్ కుమార్ 'తెలుగు కీర్తి' జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21న విజయవాడలో ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు.

రామకృష్ణకు డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పొలిటికల్ సైన్సెస్ విభాగంలో పరిశోధన చేసిన పి.రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ బి.ఆనంద నాయుడు పర్యవేక్షణలో 'అనంతపురం జిల్లాలో గ్రామీణాభివృద్ధిలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పాత్ర' అనే అంశంపై పరిశోధన చేశారు. రాచానపల్లికి చెందిన రామకృష్ణ రెండు అంతర్జాతీయ సదస్సులకు హాజరై పరిశోధన పత్రాలు సమర్పించారు. రామకృష్ణ రచించిన రెండు పరిశోధన వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

ఆదాయానికి గండి..!



అనంతపురం నగరపాక సంస్థ కార్యాలయం

ఇద్దరు అధికారుల కనుసన్నల్లోనే..

టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఇద్దరు అధికారులు ఏజెన్సీలతో కుమ్మక్కై అడ్డగోలు బాగోతానికి తెరలేపినట్లు తెలుస్తోంది. వాస్తవంగా టెండర్ నిర్వహణ ప్రకారం వెళ్లకుండా కేవలం నీకు.. నాకు అన్న చందంగా ఏజెన్సీలతో లోపాయికార ఒప్పందాలు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.. ప్రస్తుతం వీరు చేసుకున్న ఒప్పందంతో నగరపాలక సంస్థకు తక్కువ మొత్తంలో ఆదాయం వచ్చేలా రేటును ఫిక్స్ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అధికార పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు సిఫార్సుతోనే టౌన్ ప్లానింగ్ విభాగంలోని పలువురు అధికారులు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ అడ్డగోలు బాగోతానికి చెక్ పెడుతారో లేదో వేచి చూడాలి.

- యాడ్ ఏజెన్సీలకు వెన్నుదన్నుగా టౌన్ ప్లానింగ్
- టెండర్‌కు మంగళం
- ఏజెన్సీ నిర్వాహకులు కోరుకున్నట్లుగా అనుమతి
- రూ.లక్షల్లో మెక్కేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- యాడ్ ఏజెన్సీలకు అనుమతులిచ్చేందుకు రంగం సిద్ధం

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో అడ్డగోలు పనులకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఇప్పటికే పూడికతీత పనుల పేరుతో అధికార పార్టీకి చెందిన నాయకులు రూ.లక్షల్లో మెక్కేశారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో పాటుగా రూ.లక్షల్లో సీ బిల్లులు చేసుకున్నారు. తాజాగా మరో అడ్డగోలు బాగోతానికి తెరలేపారు. టెండర్ ప్రక్రియ లేకుండానే అడ్వెటైజ్‌మెంట్ బోర్డుల నిర్వహణను ఏజెన్సీలకు అప్పగించేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు సిద్ధమయ్యారు. కొందరు అధికార పార్టీ చెందిన నాయకులు, టౌన్ ప్లానింగ్ అధికారులు కుమ్మక్కై భారీగా నగరపాలక సంస్థ ఆదాయానికి గండికొట్టేందుకు తెరలేపినట్లు తెలుస్తోంది.

తగ్గనున్న ఆదాయం

నగరంలోని కమర్షియల్ ప్రాంతాల్లో లాలీపప్స్ (డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసే బోర్డులు), క్యాంటీలివర్స్ ఏర్పాటు చేసేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా నగరంలోని సూర్యనగర్ 80 అడుగుల రోడ్డు, హౌసింగ్ బోర్డు 80 అడుగుల రోడ్డులో 60 లాలీపప్స్, సూర్యనగర్ ఐరన్ బ్రిడ్జ్ నుంచి త్రివేణీ థియేటర్ వరకు 80 లాలీపప్స్, నగరంలోని ఆఫీసర్స్ క్లబ్, సూర్యనగర్ సర్కిల్, ధర్మవరం రోడ్డు, బాలాజీ టవర్స్, సంగమేశ్వర సర్కిల్, కలెక్టర్ ఆఫీస్, కళ్యాణదుర్గం రోడ్డు నడిమివంక, శ్రీకంఠం సర్కిల్, మునిసిపల్ కార్యాలయం నుంచి జెడ్పీ సర్కిల్ వరకు 30 X10 క్యాంటీ లివర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాస్తవంగా వీటి నిర్వహణ చేపట్టాలంటే ముందుగా టెండర్ ప్రక్రియ చేపట్టాలి. ఎవరు అధికంగా బిడ్ కోడ్ చేస్తే వారికి టెండర్‌ను అప్పగించాలి. కానీ ఇక్కడ అటువంటి పరిస్థితి లేదు. టౌన్ ప్లానింగ్ అధికారులు గెజిట్‌ను ముందు పెడుతూ వారు యాడ్ ఏజెన్సీలకు అనుకూలంగా ఏ ధర ఫిక్స్ చేస్తే అంత మొత్తంలో చెల్లించేలా చూస్తున్నారు. క్యాంటీ లివర్ల ఏర్పాటుకు రూ.లక్షల్లో నగరపాలక సంస్థకు ఏటా చెల్లించాల్సి ఉంటుంది. కానీ నగరపాలక సంస్థ గెజిట్‌లో తక్కువ మొత్తాన్ని నమోదు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. క్యాంటీ లివర్లకు లైటింగ్ ఉంటే ఒక రేటు, లైటింగ్ లేని వాటికి మరో రేటు ఉంటుంది. లాలీపప్స్‌కు గెజిట్‌లో ఓ రేటును ఫిక్స్ చేశారు. వాస్తవంగా టెండర్ ప్రకారం వెళితే నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అడ్వెటైజ్‌మెంట్ బోర్డులు, హోర్డింగ్‌లు, డిజిటల్ బోర్డులు, లాలీపప్స్‌తో పాటు కొత్తగా ఏర్పాటు చేసే వాటితో రూ.కోటి వరకు నగరపాలక సంస్థకు ఆదాయం రావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం నగరపాలక సంస్థకు అడ్వెటైజ్‌మెంట్ డిమాండ్ కేవలం రూ.35 లక్షలు (పాత అడ్వెటైజ్‌మెంట్ బోర్డుల నిర్వహణ) మాత్రమే వస్తోంది.

నగరపాలక సంస్థ వివరాలు..

డివిజన్లు	50
సచివాలయాలు	74
అడ్వెటైజ్‌మెంట్ల డిమాండ్	రూ.35 లక్షలు (ఏటా వచ్చే మొత్తం)
టెండర్ ప్రకారం వెళ్తే వచ్చే ఆదాయం	రూ.కోటి (ఏటా అన్ని అడ్వెటైజ్‌మెంట్‌లకు)



నిబంధనల ప్రకారం ముందుకెళ్తాం

ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నా. అడ్వెటైజ్‌మెంట్ బోర్డులు, లాలీపప్స్, తదితర ప్రచార ప్రకటనల ద్వారాఎంత ఆదాయం వస్తోంది? తదితర వివరాలపై ఆరా తీస్తాం. నూతనంగా అనుమతులిచ్చే వాటిని పక్కాగా పరిశీలిస్తాం. నిబంధనల మేరకు ముందుకు వెళ్తాం. అక్రమాలకు ఆస్కారం ఇచ్చేది లేదు.

\- మల్లికార్జున రెడ్డి, ఇన్‌చార్జ్ కమిషనర్



క్యాంటీ లివర్ నమూనా

కంది రైతులను ఆదుకోండి

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా మద్దతు ధరతో పాటు రూ.2 వేలు బోనస్ ఇవ్వాలన్నారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో రైతులు కంది సాగు చేశారన్నారు. అయితే పంటకు ఇక్కడ గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే దళారుల చేతిలో రైతులు మోసపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కంది కొనుగోళ్లలో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరను దారుణంగా తగ్గించారన్నారు. దీంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.7,550, అదనంగా రూ.2 వేలు బోనస్‌తో కలిపి రూ.9,550తో కొనుగోలు చేయాలన్నారు. రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తక్షణం కంది కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రూ.2 వేలు బోనస్ ఇవ్వాలి



జేడీఏ ఉమామహేశ్వరమ్మకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం అగ్రికల్చర్: రైతులు పండించిన కందులకు వెంటనే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూ.7,550 ప్రకారం కొనుగోలు చేయాలి. క్వింటాకు రూ.2 వేల ప్రకారం బోనస్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల కష్టనష్టాలను పరిగణలోకి తీసుకుని న్యాయం జరిగేలా చూడాలని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో లక్ష హెక్టార్లకు పైబడి విస్తీర్ణంలో కంది సాగు చేయగా.. 80 వేల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అయితే మార్కెట్‌లో ధరలు తగ్గడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే వేరుశనగ, ఇతర పంటలు కూడా దెబ్బతినడంతో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో అయినకాటికి అమ్ముకుంటూ నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం, రైతు సంఘం నాయకులు ఎం.బాలరంగయ్య, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, తరిమెల నాగరాజు, భాస్కర్, వలీ, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



అనిల్ కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్,అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం అర్బన్: పక్షులను రక్షించేందుకు 1.40 లక్షలు మానవ నిర్మిత గూళ్లను ఏర్పాటు చేయడం హర్షనీయమని కలెక్టర్ వి.వినోద్ కుమార్ కొనియాడారు. పక్షుల రక్షణకు గ్రీన్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనిల్ కుమార్ 1.40 లక్షలు మానవ నిర్మిత గూళ్ల ఏర్పాటు చేశారు. యూకే (లండన్)కు చెందిన హార్వర్డ్ వరల్డ్ రికార్డులో నమోదైంది. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్‌ను రికార్డ్ సర్టిఫికెట్‌తో పాటు అనిల్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. గ్రీన్ ఆర్మీని ఆదర్శంగా తీసుకుని ప్రకృతిలో భాగమైన పక్షుల రక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట కలెక్టర్ బి.వినూత్న తదితరులు పాల్గొన్నారు.



బీకేఎస్ నుంచి శింగనమలకు వెళ్లే రోడ్డులో ట్రాక్టర్‌లో మట్టి వేసుకుని రాంగ్ రూట్‌లో ప్రమాదకరంగా వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు

రాంగ్ రూట్.. రైట్ రైట్

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. రాంగ్ రూట్‌లో వెళ్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. బుక్కరాయసముద్రం నుంచి శింగనమలకు వెళ్లే మార్గంలో రోడ్డుకు మధ్యలో డివైడర్లు ఉన్నాయి. ఆ డివైడర్లలో చెట్లు ఏపుగా పెరగడంతో అటువైపు వారు కనిపించని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో ట్రాక్టర్ డ్రైవర్లు నిబంధలను ఉల్లంఘిస్తున్నారు. రాంగ్ రూట్‌లో మట్టి వేసుకుని వెళ్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొడితే అంతే సంగతులు. ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆర్‌టీఏ, పోలీసు అధికారులు అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

గాలింపు చర్యలు ముమ్మరం



పోలీసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

అనంతపురం: హెచ్చెల్సీ కెనాల్ ఒడ్డున బుధవారం సాయంత్రం స్నేహితులతో సరదాగా గడిపి కాలు జారి కెనాల్‌లో పడిపోయిన కౌశిక్ రెడ్డి (25) ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. హెచ్చెల్సీ కెనాల్ వెంబడి పరిశీలించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. అగ్నిమాపక శాఖ సిబ్బంది, మత్స్యశాఖ సిబ్బంది, పోలీసు సిబ్బంది గురువారం అర్ధరాత్రి వరకు తెప్పలు తెప్పించి గాలించారు. ప్రస్తుతం బుక్కరాయసముద్రం వరకు గాలించారు. కౌశిక్ రెడ్డికి ఈత రాదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తమ కుమారుడి ఆచూకీ కనుక్కోవాలని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కౌశిక్ రెడ్డి తల్లి ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం నుంచి పోలీసులతో పాటు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి గాలింపు చర్యల్లో పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి అడ్డంగా కట్టిన టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు



మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి అడ్డంగా లేకుండా ఓ పక్కకు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు

దుర'అభిమానం'

నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపులో మునిసిపల్ అధికారులు ఉదాసీనత చూపుతున్నారు. కూటమి నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా పరిషత్ వద్ద నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహం కనబడేలా టీడీపీ నాయకులు ఓ పక్కన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం కనబడకుండా దురుద్దేశంతో టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు అడ్డుగా కట్టారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు.. జెడ్పీ కార్యాలయం వద్ద ఉన్న ఫ్లెక్సీలను మాత్రం తొలగించలేదు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపులో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

పదోన్నతులు తాత్కాలికంగా ఆపాలి



అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ యశోదా బాయికి వినతిపత్రం అందజేస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకూ అనంతపురం సర్కిల్‌లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీస్ నుంచి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పదోన్నతుల ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ యశోదా బాయిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ త్వరలో నివేదిక సమర్పించనుందని తెలిపారు. ఆ తర్వాత రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలవుతుందన్నారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లుగా ఇప్పటిదాకా మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులు లేరన్నారు. అన్ని పదోన్నతుల్లోనూ మాల సామాజిక వర్గానికి చెందిన వారే అవకాశాలు దక్కించుకున్నారన్నారు. వర్గీకరణ అమలైతే మాదిగ ఉద్యోగులకు అవకాశాలు లభిస్తాయన్నారు. అప్పటిదాకా పదోన్నతుల ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్, ప్రధాన కార్యదర్శి వై.అశోక్ కుమార్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారు కదిరప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు చంద్రశేఖర్, నాయకులు నాగభూషణ, బానాశి శీనా, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కణేకల్లు: కణేకల్లుక్రాస్ – బళ్లారి మార్గమధ్యంలో అంబాపురం క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురవళ్లికి చెందిన సోంశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. సోంశేఖర్‌రెడ్డి తన స్నేహితుడు నాగిరెడ్డితో కలిసి గెనిగెర నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఇదే సమయంలో పర్వతరెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ క్రమంలో కర్ణాటక జిందాల్ ఫ్యాక్టరీ నుంచి హిందూపురానికి వెళ్తున్న లారీ కింద సోంశేఖర్‌రెడ్డి పడడంతో లారీ అతని కుడికాలుపై వెళ్లింది. కాలు నుజ్జునుజ్జు అయ్యింది. స్థానికులు అతన్ని బళ్లారి విమ్స్‌కు తరలించారు. నాగిరెడ్డి, పర్వత రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అసత్య ప్రచారాలపై చర్యలు తీసుకోవాలి



సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

అనంతపురం: కడప అమీన్ దర్గాపై అసత్య ప్రచారాలు చేస్తున్న కేఎం షకీల్ షఫీ, కట్టుబడి బాబ్జి, నూర్ బాబా, సాకత్ అలీఖాన్‌పై చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో షేక్ బాబాజీ ఫిర్యాదు చేశారు. బీజేపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఫయాజ్ ఆధ్వర్యంలో గురువారం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. కడప అమీన్ పీర్ దర్గాపై, తమ గురువు కుమారుడైన కెఎస్ఎస్ ఆరిఫుల్లా హుసేసనిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లింల మనోభావాలను కించపరుస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న నలుగురిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం

అనంతపురం: నగరంలోని ఓ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న గోనుగుంట్ల విజయ్‌కుమార్ ఈనెల 14వ తేదీ రాత్రి 10 గంటల నుంచి కనపడటం లేదని తండ్రి గీతాప్రసాద్ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మా ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి ఎక్కడికో వెళ్లిపోయాడని తెలిపాడు. నా భార్య ఆదిలక్ష్మి, పెద్ద కుమారుడు జి.గుణవర్ధన్, మా తమ్ముడు జి.శంకర నాయుడు బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎక్కడా ఆచూకీ దొరకలేదని తెలిపారు.